ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

ఆదివారం 7 ఏప్రిల్ 2024







క్రోసూరులో...



మహిళల హర్షాతిరేకం..





సత్తెనపల్లిలో జన సందోహం



క్రోసూరులో...

బాబుకు.. బ్రహ్మరథం



- దద్దరిల్లిన క్రోసూరు, సత్తెనపల్లి
- భారీగా తరలివచ్చిన మహిళలు, మైనార్టీలు

క్రోసూరు, సత్తెనపల్లి(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 6: జనమే జనం.. మహిళలు, యువత, పిల్లలు పోటెత్తారు. ప్రజాగళం సభలు దద్దరిల్లాయి. పల్నాట ఎన్నికల శంఖారావం పూరించేందుకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబుకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. భారీగా తరలివచ్చిన ప్రజానీకంతో క్రోసూరు, సత్తెనపల్లి ప్రధాన రహదారులు జనసంద్రాన్ని తలపించాయి. అడుగడుగునా ప్రజలు అధినేతకు అపూర్వ స్వాగతం పలికారు. సభలకు జనం పోటెత్తడంతో కూటమి శ్రేణుల్లో సరి కొత్త ఉత్సాహాన్ని నింపింది. చంద్రబాబు ప్రసంగాలకు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఎక్స్‌కవేటర్ల సాయంతో భారీ పూలమాలలతో అభిమానులు, నేతలు చంద్రబాబును ఘనంగా సత్కరించారు. క్రోసూరులోని ఎన్టీఆర్ సెంటర్, సత్తెనపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లలో జరిగిన ప్రజాగళం సభల్లో చంద్రబాబు ప్రసంగించారు. క్రోసూరు, సత్తెనపల్లికి ఎన్నోసార్లు వచ్చా.. ఈసారి మాత్రం ఎక్కడాలేని ఉత్సాహం వచ్చిందని జనాన్ని చూసిన అధినేత ఆనందం వ్యక్తం చేశారు. తొలుత చంద్రబాబు హెలికాప్టర్‌లో క్రోసూరుకు వచ్చారు. ఆ తర్వాత రోడ్‌షోగా క్రోసూరు, సత్తెనపల్లిలో పర్యటించి ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సభల్లో ప్రసంగించారు. దారిపొడవునా ప్రజలు బాబుకు నీరాజనాలు పట్టారు. మండు టెండ ని లెక్క చేయకుండా వేలాదిమంది ప్రజలు శనివారం మధ్యాహ్నా మే అందుకూరు కూడలికి తరలివచ్చి నిరీక్షించారు.



సత్తెనపల్లిలో ప్రసంగిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ, అభివాదం చేస్తున్న చంద్రబాబు, పక్కన శ్రీకృష్ణ దేవరాయలు

క్రోసూరులో కొమ్మాలపాటి, భాష్యం ప్రవీణ్ అనుచరులు, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఐక్యతని చాటారు. కొమ్మాలపాటి శ్రీధర్ అధ్యక్షతన సభ నిర్వహించాలని భాష్యం ప్రవీణ్‌కి ఆదేశాలు జారీ చేశారు. సభలో చంద్రబాబు ప్రసంగం ప్రారంభిస్తూనే పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌కు ఎమ్మెల్సీ పదవిని ప్రకటించారు. క్రోసూరు పర్యటన ముగించుకుని సత్తెనపల్లికి చేరుకోవడానికి ఆలస్యమైనప్పటికీ వేలాది మంది ప్రజలు చంద్రబాబు రాక కోసం నిరీక్షించారు. రాత్రి 10 గంటలైనా ఎంతో ఓపిగ్గా జనం చంద్రబాబు ప్రసంగాన్ని ఆలకించారు.

సత్తెనపల్లిలోనే బస

సత్తెనపల్లిలో శనివారం రాత్రి చంద్రబాబు బస చేశారు. సభ అనంతరం పట్టణంలోని వెంకటేశ్వర గ్రాండ్‌కు వెళ్లారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు పార్టీ నేతలతో సమావేశం కానున్నారు. పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ అభ్యర్థులు, లోక్‌సభ అభ్యర్థి లావుతో ఎన్నికల వ్యూహాలపై చంద్రబాబు చర్చించనున్నారు. అనంతరం మధ్యాహ్నాం రెండు గంటల తర్వాత చంద్రబాబు హెలికాప్టర్లో కృష్ణా జిల్లా పామర్రు బయలుదేరి వెళ్తారని టీడీపీ నేతలు తెలిపారు.



ప్రసంగిస్తున్న జంగా, పక్కన యరపతినేని



కపిలవాయికి పసుపు కండువా కప్పుతున్న చంద్రబాబు

- నాది విజన్.. జగన్‌ది పాయిజన్. గంజాయి కావాలంటే జగన్ రావాలి.. గంజాయి పోవాలంటే ఎన్డీయే అధికారంలోకి రావాలి.
- జాబ్ కావాలంటే బాబు రావాలి. మెగా డీఎస్సీ నిర్వహిస్తా. జాబ్ క్యాలండర్‌ను అమలు చేస్తా. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాం. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగులకు ఉద్యోగ భృతి ఇస్తాను.
- వంద రోజుల్లో జే బ్రాంబ్ మద్యం, గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలిస్తా.
- ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్‌కు కట్టుబడి ఉన్నా. దుల్హాన్.. రంజాన్ కానుకను అందిస్తా.
- కార్మికుల ఉపాధికి గండి కొట్టిన ఫ్యాన్‌కు ఈ ఎన్నికల్లో సమాధి కట్టాలి.
- సీఎం జగన్ జనానికి రూ.10 ఇచ్చి వారి నుంచి వివిధ రూపాల్లో రూ.100 తీసుకుంటున్నారు. పింఛన్ల పంపిణీలో జగన్ శవరాజకీయాలు చేస్తున్నారు.
- అధికారంలోకి రాగానే అమరావతిని నిర్మించి, పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి కల్పించి వలసలు నివారిస్తా. పేదరికంలేని రాష్ట్రంగా తయారు చేస్తా.
- సంపద సృష్టించి అందరికీ పంచే పార్టీ తెలుగుదేశం. సూపర్ సిక్స్‌తో అందరి జీవితాలు మారతాయి.

గోదావరిని తీసుకొచ్చి.. సస్యశ్యామలం చేస్తా



- ఎన్డీఏ విజయంతో భవిష్యత్‌కు బంగారు బాటలు
- ఉచిత ఇసుక అందించి కార్మికులకు ఉపాధి కల్పిస్తా
- క్రోసూరు, సత్తెనపల్లి ప్రజాగళం సభల్లో చంద్రబాబు

ఈ ఏడాది సాగునీరు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. నేను అధికారంలో ఉండంగా గోదావరి జలాలను సాగర్ కుడి కాల్వకు తరలించే ఎత్తిపోతల పథకాన్ని చేపడితే ఈ దుర్మార్గపు జగన్ దానిని నిలిపివేశాడు. మళ్లీ అధికారంలోకి రాగనే యుద్ధప్రాతిపదికన గోదావరి జలాల తరలింపు పథకాన్ని పూర్తి చేస్తా. గోదావరి జలాలతో ఆయకట్టును సస్యశ్యామలం చేస్తాను.. అని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు క్రోసూరు.. సత్తెనపల్లి ప్రజాగళం సభల్లో స్పష్టం చేశారు. ఆయా సభల్లో ఆయన ప్రసంగిస్తూ అన్నదాతలకు రూ.20 వేలు ఆర్థిక సహాయంతో పాటు ప్రతీ ఎకరాకు సాగు నీరు అందించేందు కోసం ప్రాజెక్టులు పూర్తి చేస్తానని తెలిపారు. ఎన్నికల వరకు యువకులు సైకిల్‌పై తిరిగి ఎన్డీఏను గెలిపిస్తే భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తానని చెప్పారు. ఇసుక ఉచితంగా అందించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పిస్తానన్నారు. అమరావతిలో ఎలాంటి అవకతకలు జరగలేదని, కానీ కావాలనే దానిని చంపేశారన్నారు. పెదకూరపాడులో కూడా ఐటీ పార్క్ వస్తుందని హామీ ఇచ్చారు.

టీడీపీలోకి ఎమ్మెల్సీ జంగా, కపిలవాయి

పసుపు కండువా కప్పి ఆహ్వానించిన చంద్రబాబు

పల్నాడు జిల్లాలో వైసీపీకి బిగ్‌షాక్ తగిలింది. ప్రజాగళం సభల్లో వైసీపీ సీనియర్ నేతలు ఆ పార్టీని వీడి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. గురజాల నియోజవర్గానికి చెందిన బీసీ నేత ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తన అనుచరులతో సత్తెనపల్లి ప్రజాగళం సభలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అదేవిధంగా క్రోసూరు సభలో నరసరావుపేటకి చెందిన వైసీపీ ముఖ్య నాయకుడు, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయ్ కుమార్, న్యాయవాది చిన్నపరెడ్డి టీడీపీలో చేరారు. వీరికి చంద్రబాబు పసుపు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జంగా మాట్లాడుతూ రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధికి విజన్ ఉన్న నేత చంద్రబాబు అవసరం ఉందన్నారు. పల్నాడు, రాష్ట్ర దిశ దశ మారాలంటే చంద్రబాబును సీఎంని చేసుకోవాలన్నారు.





అందరికీ ఓటుపై సందిగ్ధం

- దరఖాస్తులను తిరస్కరిస్తోన్న ఈఆర్‌వోలు
- ఇటీవల 18 ఏళ్లు పూర్తి అయిన వారివే స్వీకారం
- అంతకంటే ఎక్కువ వయసుంటే ఆమోదించని వైనం
- అర్హులందరూ నమోదు కావాలన్న సూత్రానికి విరుద్ధంగా చర్యలు

గుంటూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గతంలో వివిధ కారణాలతో ఓటు హక్కు పొందలేకపోయిన వారు కొత్తగా నమోదు చేసుకునేందుకు దాఖలు చేస్తోన్న దరఖాస్తులను ఈఆర్‌వోలు తిరస్కరిస్తున్నారు. అలానే గతంలో ఓటరుగా నమోదై ఉండి ప్రస్తుతం ఓటరు జాబితాలో పేరు లేని వారికి కూడా ఫారం-6 పెట్టుకునే అవకాశం కల్పించడం లేదు. కేవలం కొత్తగా 18 ఏళ్ల వయస్సు నిండిన వారి ఓటు హక్కు కోసం చేసుకొంటున్న దరఖాస్తులను మాత్రమే స్వీకరించి వాటిని పరిష్కరిస్తున్నారు. దీంతో అర్హులైన వారంతా ఓటరుగా నమోదై సార్వత్రిక ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవాలన్న కేంద్ర ఎన్నికల సంఘం ప్రాథమిక సూత్రానికి జిల్లాలో విఘాతం కలుగుతోంది. స్పెషల్ సమ్మరి రివిజన్-2024 జనవరి 22తో పూర్తి అయింది. అయితే కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తులను డిసెంబరులోనే తీసుకోవడాన్ని నిలిపేశారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం మళ్లీ దరఖాస్తులు స్వీకరించడం ప్రారంభించారు. అయితే వివిధ కారణాలతో ఓటుహక్కు కోల్పోయినవారివి మాత్రం తీసుకోవడం లేదు. తుది ఓటర్ల జాబితా ప్రచురణకు ముందు వైసీపీ నేతలు గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో పెద్ద సంఖ్యలో ఫారం-7లు దాఖలు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా ఒక్కొక్కరు పదుల సంఖ్యలోనే అర్జీలు పెట్టారు. వాటిల్లో చాలావరకు ఓట్లు తొలగిపోయాయి. ఉపాధి నిమిత్తం తాత్కాలికంగా వేరే ప్రాంతానికి వెళ్లి తిరిగి స్వస్థలాలకు వచ్చిన ఓటర్ల పేర్లు చాలామందివి ప్రస్తుతం జాబితాల్లో కనిపించడం లేదు. ఎవరివైతే ఓట్లు అకారణంగా తొలగించారో వారి పేర్లను తిరిగి జాబితాల్లో చేర్చేందుకుపెడుతున్న దరఖాస్తులను ఈఆర్‌వోలు ఆమోదించడం లేదు. అదేమంటే తమకు పైనుంచి ఆదేశాలు ఉన్నాయని చెబుతున్నారు. అలాంటప్పుడు 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలని ఈసీ చేస్తున్న విజ్ఞప్తులకు విలువ ఎక్కడిదని అర్హత ఉండి ఓటరుజాబితాలో పేరు లేని వారు ప్రశ్నిస్తున్నారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం 42,447 కొత్త ఓటరు దరఖాస్తులు వచ్చాయి. వాటిలో కేవలం 20,197 మందికి మాత్రమే ఇప్పటి వరకు ఓటు హక్కు కల్పించారు. దీనిని పరిగణనలోకి తీసుకుంటే దాదాపుగా 50 శాతం వరకు తిరస్కరించినట్లు స్పష్టమౌతున్నది. ఈ నేపథ్యంలో వారిలో అర్హత ఉండి ఓటుహక్కు కల్పించని కారణంగా వారు ఓటింగ్‌కు దూరం కానున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.27(ఆదివారం)

సహారీ (ఉదయం) 4.40 (సోమవారం)

సిద్ధంతో.. ప్రయాణ కష్టాలు

- వైసీపీ సభలకు 490 బస్సుల తరలింపు
- నాలుగురోజులు సీఎం జగన్ సేవలోనే ఆర్టీసీ

గుంటూరు, ఏప్రిల్ 6: ప్రయాణికుల నుంచి ఎన్ని నిరసనలు, విమర్శలు ఎదురైనా ఆర్టీసీ సీఎం జగన్, వైసీపీ సేవలో తరిస్తోంది. సిద్ధం సభలకు నాలుగు రోజులుగా బస్సులను తరలించి ప్రయాణికుల కష్టాలను గాలికి వదిలేస్తోంది. శనివారం కావలిలో జరిగిన సిద్ధం సభకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 490 బస్సులను కేటాయించారు. కావలి సభ ముగిశాక అటు నుంచి అటే ఆదివారం జరిగే పొదిలి సభకు జనసమీకరణ కోసం ఆయా బస్సులను వినియోగించేలా తరలించనున్నారు. ఆ బస్సులనే తిరిగి సోమవారం పిడుగురాళ్లలో జరిగే సిద్ధం సభకు కేటాయించారు. శుక్రవారం సాయంత్రం నుంచే ఆయా బస్సులను తరలించడంతో మంగళవారం వరకు సామాన్య ప్రయాణికులకు బస్సులు అందుబాటులో ఉండే పరిస్థితి లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు-1, 2 డిపోలతో పాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల నుంచి 190 బస్సులను, పల్నాడు 200 సర్వీసులు, బాపట్ల జిల్లా నుంచి మరో 100 బస్సులను సీఎం జగన్ సభలకు తరలించారు. కండీషన్‌లో ఉన్న అరకొర బస్సులను సిద్ధం సభలకు తరలించటంతో మిగిలిన అరకొర డొక్కు బస్సుల కోసం కూడా ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. విజయవాడ, తెనాలి, పర్చూరు, అమరావతి రూట్లలో బస్సులు సరిపడా లేక ప్రయాణికులు నరకయాతన పడాల్సి వచ్చింది.



గుంటూరు బస్టాండ్‌లో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు



బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

రాష్ట్ర రాజధాని అమరావతి విధ్వంసం సిగ్గుచేటు

- 1572వ రోజుకు చేరుకున్న రైతు ఆందోళనలు

తుళ్లూరు, ఏప్రిల్ 6: రాష్ట్ర రాజధాని అమరావతిని విధ్వంసం చేయటం సిగ్గుచేటని 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1572వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి ఆందోళనలు, నిరసన దీక్షలు చేస్తున్న పలువురు రైతులు మాట్లాడుతూ మూడు రాజధానులని రాష్ట్రాభివృద్ధికి గండి కొట్టారన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును పరిగణనలోకి తీసుకొని అమరావతి అభివృద్ధి కొనసాగించాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు.

అభివృద్ధి-సంపద-సంక్షేమం

- అదే టీడీపీ విధానం.. నినాదం
- పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి
- తాడేపల్లిలో అపార్టుమెంట్‌వాసులతో లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 6: అభివృద్ధితోనే సంపద సృష్టి సాధ్యపడుతుంది. ఆ సత్యాన్ని టీడీపీ నమ్ముతుంది. సంపాదన ఉంటే ఖర్చు ఎంతైనా చేయవచ్చు. సంక్షేమానికి పెద్దపీట వేయవచ్చు. అభివృద్ధి-సంపద-సంక్షేమం అనేదే టీడీపీ విధానం. నినాదం.. అని ఆ పార్టీ మంగళగిరి అభ్యర్థి నారా లోకేశ్ తేల్చి చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా లోకేశ్ శనివారం తాడేపల్లిలోని పూజిత అపార్టుమెంట్‌వాసులతో సమావేశమై ప్రసంగించారు. జగన్ తిరోగమన చర్యలతో తమ లక్ష్యం కొంత కష్టంతో కూడుకున్నదే అయినా పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. పెద్దఎత్తున పరిశ్రమలను రప్పించి ఇరవై లక్షల మందికి ఉద్యోగాలను ఇప్పించడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ఉపాధికల్పన యజ్ఞం ద్వారా రాష్ట్ర సంపద రెండున్నర రెట్లు వృద్ధి చెందుతుందన్న నమ్మకం తమకుందన్నారు. దీని వల్ల ఇప్పటికన్నా మరింత మెరుగైన సంక్షేమాన్ని ప్రజలకు అందించవీలతుందన్నారు. అప్పులు చేసి సంక్షేమం చేస్తే.. పన్నులు, చార్జీల రూపంలో ప్రజలపై భారాన్ని వేయాల్సి వస్తుదన్నారు. ప్రస్తుతం జగన్ పాలనలో ఇన్నిరకాల పన్నులు ఈ రీతిన పెరగడానికి రూ.12 లక్షల కోట్ల అప్పుల భారమే కారణమన్నారు. గన్నవరం ఎయిర్‌పోర్టుకి భూములిచ్చిన రైతులకు అధికారంలోకి వచ్చిన రెండు మాసాల్లోగా రాజధాని అమరావతి ఏరియాలో భూములు కేటాయించి వారికి న్యాయం చేస్తామని చెప్పారు. మంగళగిరికి పరిశ్రమలు రావన్న ఎమ్మెల్యే ఆళ్ల వ్యాఖ్యలపై లోకేశ్ మండిపడ్డారు. విధ్వంసకర పాలన వల్లే ఒక్క పరిశ్రమ, ఒక్కరికి ఉద్యోగం కానీ రాలేదన్నారు. దీంతో ఉద్యోగాల కోసం మన పిల్లలు పొరుగు రాష్ట్రాలకు వెళ్లాల్సివచ్చిందన్నారు. అధికారంలో లేకపోయినా ఐదేళ్లుగా తాను 29 సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో అమలుచేశానని గుర్తుచేశారు. ఐటీ కంపెనీ రప్పించి 150 మందికి ఉద్యోగాలను కూడా ఇప్పించానన్నారు. చేనేతల కోసం వీవర్స్‌శాలను ఏర్పాటు చేసి టాటా సంస్థతో ఒప్పందం చేసుకుని చేనేత కార్మికులకు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించామన్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక మంగళగిరిలో గోల్డ్ క్లస్టర్‌ను ఏర్పాటుచేసి 40 వేలమందికి ఉపాధిని కల్పించి తీరుతామని చెప్పారు.

రివర్‌ఫ్రంట్‌ను అభివృద్ధి చేయాలి

అమరావతిలో కరకట్ట వెంబడి రివర్‌ఫ్రంట్‌ను హైదరాబాద్ ట్యాంక్‌బండ్ మాదిరి అభివృద్ధి చేయాలని, అమరావతిని కల్చరల్ అండ్ హెరిటేజ్ సెంటర్‌గా అభివృద్ధి చేయాలని పూజిత అపార్టుమెంట్‌వాసులు కోరారు. మంగళగిరి ప్రాంతంలో పెయింటింగ్ పరిశ్రమలను, పసుపు ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను అభివృద్ధి చేయాలన్నారు. మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో వాటర్ స్పోర్ట్స్ గేమ్స్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అమరావతిలోని విట్, ఎస్ఆర్ఎం వంటి విద్యాసంస్థలకు వెళ్లే రహదారులను అభివృద్ధి చేయాలని, డిజిటల్ లైబ్రరి, వర్క్‌షాపులు, రీసెర్చి సెంటర్‌ను ఏర్పాటుచేయాలని కోరారు. వారి సమస్యలపై లోకేశ్ స్పందిస్తూ అధికారంలోకి వచ్చాక వీధిలైట్లు, అండర్ గ్రౌండు డ్రెయినేజి, ప్రతి ఇంటికి కుళాయి, కృష్ణానదిపై అవసరమైన చోట్ల, కాల్వలపై చెక్ డ్యామ్‌లను ఏర్పాటుచేస్తామని, కొండ ప్రాంతాల్లో హైకింగ్ ట్రయల్స్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నందం అబద్దయ్య, వల్లభనేని వెంకట్రావు, అమరా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిలోని పూజిత అపార్టుమెంటు వాసులతో మాట్లాడుతున్న నారా లోకేశ్

పల్నాడు ప్రజలకు మాటిచ్చి మోసం చేశారు

- క్షమాపణ చెప్పాకే జగన్ ఇక్కడ అడుగు పెట్టాలి
- జీవీ ఆంజనేయులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన

వినుకొండ, ఏప్రిల్ 6: వ మాటిచ్చి మోసం చేసిన జగన్ పల్నాడు ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాకే పల్నాడు గడ్డపై అడుగు పెట్టాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మక్కెనతో కలసి శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. జీవీ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో సీఎం జగన్, ఎమ్మెల్యే బొల్లా పల్నాడుకు తీరని ద్రోహం చేశారన్నారు. పల్నాడు ప్రాంతానికి కరువు తీర్చడం కోసం టీడీపీ హయాంలో చంద్రబాబు గోదావరి, పెన్నా అనుసంధానం చేసి నకరికల్లు వద్ద ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసి రూ.6వేల కోట్లు నిధులు కేటాయిస్తే జగన్ దాన్ని అటకెక్కించారని అన్నారు. వినుకొండలో 100పడకల ఆసుపత్రి నిర్మిస్తామని, బొల్లాపల్లి చెరువుకు ప్రధాన కాలువ నుండి నీటి సరఫరా చేస్తామని, మైనారిటీ, గురుకుల పాఠశాలకు నిధులిస్తామని, వరికపూడిశెల ప్రాజెక్ట్‌ను పూర్తిచేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. సీఎంని అడిగే ధైర్యం బొల్లాకు లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ బొల్లాపల్లి మండలంలో తాగునీటి కష్టాలు తీర్చడానికి రూ.10కోట్లు, తారురోడ్ల నిర్మాణానికి రూ.20కోట్లు, 100 పడకల ఆసుపత్రికి, ముస్లిం మైనారిటీ కళాశాలలకు నిధులు మంజూరైనట్లు బొల్లా పచ్చి అబద్దాలు చెప్పారని మండిపడ్డారు. వినుకొండ ప్రజలు తెలివైనవారని, బొల్లాకు బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు మానుకొండ శివప్రసాద్, షమీంఖాన్, ఆయూబ్ ఖాన్, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

సంక్షేమం పేరిట బటన్ నొక్కుడుతో మోసం

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



భవిష్యత్ గ్యారెంటీ పత్రాలను ప్రదర్శిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి తదితరులు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్6: నవరత్నాల సంక్షేమ రాజ్యం అంటూ బోగస్ బటన్ నొక్కుళ్లతో ఇంకెంత కాలం ప్రజలను మోసం చేస్తావు జగన్ అని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. పట్టణంలో 25వ వార్డులో కుటుంబ సాధికార సారధులు, బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులతో ప్రత్తిపాటి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల డ్వాక్రా మహిళలకు ఆసరా, విద్యార్థులకు విద్యా దీవెన, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, నగదు అన్ని విషయాల్లోను బటన్‌లు నొక్కినా డబ్బులు మాత్రం లబ్ధిదారుల ఖాతాల్లో వేయలేదని ఆయన ధ్వజమెత్తారు. పింఛన్ల పంపిణీ విషయంలో ఇంటింటికి వెళ్ళటం కుదర లేదని రాద్ధాంతం చేస్తున్న అధికార పక్షాన్ని బటన్‌లు నొక్కిన మొత్తాలను ఖాతాల్లో వేయకుండా ఎవరు అడ్డుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. బటన్ నొక్కి నెల కావస్తున్నా 90శాతం విద్యార్థులకు విద్యాదీవెన అందలేదని, కరువు, తుఫాన్‌ల పరిస్థితుల్లో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సాయం కూడా అందించ లేదని వాపోయారు. సొంత కాంట్రాక్టర్ల బిల్లుల కోసం వేల కోట్ల రూపాయలు మళ్ళించి చెల్లింపులు చేస్తున్న జగన్ సర్కార్ పేదల సంక్షేమంపై ఎందుకింత నిర్లక్ష్యం వహిస్తుందో చెప్పాలన్నారు.

లావు, శ్రీధర్‌లపై చంద్రబాబు ప్రశంసలు

- కొమ్మాలపాటికి ఎమ్మెల్సీ పదవిస్తానని ప్రకటన



చంద్రబాబుతో లావు శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం ప్రవీణ్

సత్తెనపల్లి, ఏప్రిల్ 6: క్రోసూరులో శనివారం జరిగిన సభలో చంద్రబాబు నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌లను ప్రశంసించారు. వివాదాలకు దూరంగా ఉంటూ, అభివృద్ధి కోసం పనిచేసే నేత లావు అని కొనియాడారు. అమరావతిని ధ్వంసం చేస్తుంటే సహించలేక జగన్‌తో ఇక చాలని బయటకు వచ్చిన వ్యక్తి శ్రీకృష్ణదేవరాయలన్నారు. అదే నంబూరు శంకరరావు ఒక్కసారైనా అమరావతి గురించి మాట్లాడావా? అంటూ నిలదీశారు. 'లావు' మీద ప్రజల్లో ఉన్న విశ్వాసం, నమ్మకం సభలో ప్రస్ఫూటంగా కనిపిస్తోందన్నారు. ఆయనను ప్రజలంతా స్వీకరించారని సభలో వస్తున్న స్పందనే చెబుతోందన్నారు. పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పార్టీని కాపాడారని, పార్టీ కోసం కష్టపడ్డారన్నారు. శ్రీధర్ లాంటి నాయకుడు దొరకడం అదృష్టమన్నారు. తాను ఎక్కడా ఎవరికి ఫలానా పదవి ఇస్తానని చెప్పనని, అయితే ఇక్కడ శ్రీధర్‌కి ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పానంటే అది ఆయన ప్రత్యేకత అన్నారు. భాష్యం ప్రవీణ్ పేరు ప్రకటించిన తర్వాత శ్రీధర్ నా వద్దకు వచ్చి భారీ మెజార్టీతో ప్రవీణ్‌ని గెలిపించుకుని వస్తానన్నారు. అది కొమ్మాలపాటికి పార్టీ మీద ఉన్న విధేయతని అని ఆయన్ను ప్రశంసించారు.

చంద్రబాబుతోనే సాధ్యం : లావు

సాగు, తాగు నీటి కష్టాలకు పరిష్కారం గోదావరి, కృష్ణా అనుసంధానం చేయాలని, ఆ పని జరగాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. జలజీవన్ మిషన్‌తో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేసుకుంటేనే పరిశ్రమలు, ఉద్యోగాలు వస్తాయన్నారు. దుల్హన్ పథకం, బీసీలకు రక్షణ చట్టం తీసుకువస్తామని, 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామన్నారు. ప్రతి రూపాయి దళితులకే ఖర్చు పెడతామని హామీ ఇచ్చారు.

బీసీలకు టిక్కెట్ ఇవ్వం పో అన్నారు

- ఎమ్మెల్సీ జంగా ఆవేదన



దాచేపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి, ఏప్రిల్6: నాలుగుసార్లు పోటీ చేశాను.. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచాను.. నాకు టిక్కెట్ ఇవ్వాలని వైసీపీ అధిష్టాన వర్గాన్ని అడిగితే నీకు టిక్కెట్ ఇవ్వం.. పో అన్నారని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తెలిపారు. శనివారం గుర్రం జాషువా, మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో జంగా మాట్లాడుతూ గురజాలలో గెలిచినా ఓడినా బీసీ సామాజికవర్గానికి టిక్కెట్ ఇవ్వాలని కోరామన్నారు. కానీ ఇప్పుడున్న కాసు మహేష్‌రెడ్డికే ఇస్తామని అధిష్టానం స్పష్టం చేసిందని తెలిపారు. బీసీలు సామాజికంగా ఎదగకూడదా, రాజకీయ ప్రాధాన్యత వారికి అవసరం లేదా అని జంగా ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 139 మంది బీసీ వర్గాల జీవన ప్రమాణం, విద్య, పలు అంశాలపై అధ్యయనం చేసి సీఎం జగన్‌కు నివేదిక అందజేశానన్నారు. జగన్ గెలుపుకు బీసీల ప్రధాన భూమిక పోషించాను. బీసీలకు పదవులిచ్చారు కానీ పదవులకు తగిన గౌరవం లేదు. నా ఆత్మగౌరవంపై దెబ్బకొట్టారు. నన్ను నమ్ముకున్న నా కార్యకర్తలను, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను అవమానపరిచి ఇబ్బంది పెట్టారు. ఈ విషయాలన్నీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని జంగా ఆవేదన వ్యక్తం చేశారు. నా తుదిశ్వాస వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీల గౌరవం కోసం పోరాటం చేస్తానన్నారు. ఆయనతో పాటు బడుగు బలహీనవర్గాల నాయకులు, పల్నాడు బలహీనవర్గాల ఐక్యవేదిక సభ్యులు ఉన్నారు. 150కి పైగా వివిధ వాహనాల్లో జంగా సత్తెనపల్లిలోని చంద్రబాబు సభకు భారీ ర్యాలీగా తరలివెళ్లారు.

వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తా

- చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో పెమ్మసాని



సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని, నసీర్, మాధవి

గుంటూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వ్యాపారస్తుల సమస్యలు పరిష్కరిస్తానని, చిన్న చిన్న వ్యాపారస్తులు పడే ఇబ్బందులకు పరిష్కార మార్గాలు చూపుతానని గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో శనివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కరూ ఇబ్బంది పెట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటామని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ వన్‌టౌన్‌లో ప్రశాంతంగా జీవించే వ్యాపారస్తుల ఆస్తులను కొందరు నాయకులు కబ్జా చేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఒక చేతకాని దద్దమ్మ పాలనలో గుంటూరు ప్రజల అవస్థలు పడుతున్నారన్నారు. పెమ్మసాని అడుగుజాడల్లో నడుస్తూ పెద్దవారికి తమ్ముడిగా చిన్నవారికి అన్నగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి పిడుగురాళ్ల మాధవి మాట్లాడుతూ అందరి సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్(బాబు), గుంటూరు చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ ఆతుకూరి ఆంజనేయులు, మిర్చి మార్కెట్ యార్డుమాజీ వైస్ చైర్మన్ కొత్తూరి వెంకట్, కార్పొరేటర్ పోతురాజు సమత, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయస్థాయి నాటికల పోటీలు

యడ్లపాడు, ఏప్రిల్ 6: కళలు, కళాపరిషత్‌లు, కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రకాశం, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని ఏడు కళాపరిషత్‌లతో కలిపి తెలుగు నాటక కళాపరిషత్‌ల సమ్మేళనం వేదిక గత ఏడాది డిసెంబరులో ఏర్పాటైంది. ఈ వేదిక ఏర్పడిన తరువాత తొలి సారిగా లింగారావుపాలెం కొండవీటి కళాపరిషత్, యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్‌లు సంయుక్తంగా జాతీయస్థాయి నాటకోత్సవాలు నిర్వహిస్తున్నాయి. ఈ నెల 7 ఆదివారం నుంచి నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో భాగంగా 7, 8 తేదీలలో లింగారావుపాలెం జడ్పీ హైస్కూల్ ఆవరణలోని పోసాని సుబ్బారావు చౌదరి స్మారక కళావేదికపైన, 9, 10 తేదీలలో యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళాప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదికపైన నాటికల పోటీలను నిర్వహిస్తున్నారు. రోజు 8గంటల నుంచి రాత్రి 11గంటల వరకు మూడు ప్రదర్శనల చొప్పు న నాలుగు రోజులపాటు 12 నాటికలు ప్రదర్శితం అవుతాయని వేదిక, పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్ అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు, కొండవీటి కళాపరిషత్ అధ్యక్షుడు కట్టా శ్రీహరిలు తెలిపారు.

గోశాలకు ఇచ్చిన స్థలాన్ని కాసు అనుచరులు కాజేశారు

- మాతాపిత గోశాల నిర్వాహకులు పిచ్చయ్య



మాట్లాడుతున్న మాతాపితా గోశాల నిర్వాహకులు పసుపులేటి పిచ్చయ్య

దాచేపల్లి, ఏప్రిల్ 6: దాచేపల్లిలో తమకు కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అనుచరులు ఆన్‌లైన్‌లో తొలగించారని మాతాపిత గోశాల నిర్వాహకులు పసుపులేటి పిచ్చయ్య ఆరోపించారు. ఈ మేరకు సెల్‌ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. పట్టణంలోని ఎర్రగుంట నాము ప్రాంతంలో గోశాల నిర్వహణకు గత ఏడాది తహసీల్దారు వెంకటేశ్వరనాయక్ 3 ఎకరాల స్థలాన్ని మంజూరుచేశారని తెలిపారు. అయితే ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అనుచరులు ఆన్‌లైన్‌లో తొలగించారని తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వద్దకు పలుమార్లు తిరిగినా పట్టించుకోలేదని అన్నారు. గోవులకు అన్యాయం చేసిన కాసు మహేష్‌రెడ్డి ఓటు వేసి గెలిపించుకున్నా సామాన్య ప్రజలకు ఏమి న్యాయం చేస్తామని పిచ్చయ్య ప్రశ్నించారు.

వడదెబ్బకు వృద్ధురాలి మృతి

దాచేపల్లి, ఏప్రిల్ 6: వడదెబ్బకు వృద్ధురాలు మృతి చెందిన ఘటన దాచేపల్లిలో చోటు చేసుకుంది. పట్టణంలోని వడియరాజుల కాలనీకి చెందిన ఉప్పు రంగమ్మ(80) శనివారం ఎండధాటికి తుదిశ్వాస విడిచింది.

ఉప్పటూరి సీతామహాలక్ష్మికి కన్నీటి వీడ్కోలు



ఉప్పటూరి సీతామహాలక్ష్మి అంతిమయాత్రలో పాల్గొన్న స్థానికులు

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 5: వేలాదిమంది అభిమానుల మధ్య మాజీ జడ్పీ టీసీ ఉప్పటూరి సీతామహాలక్ష్మి భౌతిక కాయానికి కన్నీటి వీడ్కోలు పలికారు. శనివారం ఉదయం పుల్లడిగుంటలోని శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు జరిగాయి. కుమారుడు, ఎన్ఆర్ఐ ఉప్పటూరి రామ్‌చౌదరి ఆమె చితికి నిప్పంటించి అంత్యక్రియలు నిర్వహించారు. వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండల గ్రామాల నుంచి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, ఆమె ద్వారా వివిధ రూపాల్లో సహాయం పొందిన వారు సైతం భారీగా తరలివచ్చి ఘనంగా నివాళులర్పించారు. కుమారుడు రామ్‌చౌదరి, భర్త చినరాములు ప్రోత్సాహంతో అడిగినవారికి కాదనకుండా తోడ్పాటునందించడంతో ప్రతి ఒక్కరి హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయారని అంతిమయాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరు వాఖ్యానించారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు మృతి

- దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ఘటన

అమరావతి, ఏప్రిల్ 6: ఆలయాన్ని దర్శించుకుని తిరిగి వెళుతూ ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు మృతి చెందిన ఘటన మండలంలోని ఉంగుటూరు రోడ్‌లోగల కోల్డ్‌స్టోరేజి సమీపంలో జరిగింది. వివరాలలోకి వెళితే.. పెదకూరపాడు మండల పరిధిలోని కంభంపాడు గ్రామానికి చెందిన ఓ కుటుంబం శనివారం ఉదయం ట్రాక్టర్‌పై వెళ్లి అనంతవరంలోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. మధ్యాహ్నం సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా ట్రాక్టర్ ట్రక్కు బోల్తాపడటంతో కె.సామ్రాజ్యం(65), ఆమె మనుమరాలు త్రివేణి(18) అక్కడికక్కడే మృతిచెందారు. మిగిలినవారికి గాయాలు కాగా గుంటూరు ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. త్రివేణికి నెలరోజుల క్రితం వివాహం జరిగింది. సమాచా రం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పం చనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్రం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	154, 163,174
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలి

● కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 6: జిల్లాలో సాధారణ ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు జరిగేలా నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన స్టాట్యూటరీ బృందాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు తనిఖీలు నిర్వహించేలా రిటర్నింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎన్నికల అంశాలపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఓటర్ల దరఖాస్తుల పరిష్కారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై తీసుకున్న చర్యలు, సీవిజిల్, ఇతర ఫిర్యాదుల పరిష్కారం, స్టాట్యూటరీ బృందాలు, ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీల సీజ్ చేసిన నగదు, మద్యం, ఇతర వస్తువులు తదితర అంశాలపై రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లాల వారీగా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించి సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సంయుక్త కలెక్టర్ జి.రాజ కుమారి, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తీ చేకూరి, తెనాలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజాతో కలసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వేణుగోపాల్‌రెడ్డి అధికారులతో మాట్లాడుతూ ఓటరు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో విచారించి నిర్దేశిత సమయానికి సక్రమంగా పరిష్కరించేలా వీఆర్వోలు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లను రోజు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల నివేదికలు నిర్దేశిత నమూనాలో రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందించాలన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మీ, నోడల్ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

మిలటరీ విశ్రాంత ఉద్యోగులకు క్యాష్ లెస్ కింద కీళ్ల మార్పిడి



డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 6 : మిలటరీ విశ్రాంత ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు క్యాష్ లెస్ కింద కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ మిలటరీ విశ్రాంత ఉద్యోగులకు వైద్య సేవలు అందించేందుకు సంబంధిత శాఖ నుంచి అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. దేశ రక్షణలో ప్రాణాలని పణంగా పెట్టి సేవలందించిన విశ్రాంత ఉద్యోగులకు వైద్య సేవలు అందించే అవకాశం రావడం మహాభాగ్యమని పేర్కొన్నారు. ఖరీదైన మోకీలు, తుంటి మార్పిడి ఆపరేషన్‌లను క్యాష్ లెస్ కింద అందించే ఈ అవకాశాన్ని విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నరేంద్రరెడ్డి సూచించారు.

ప్రజలకు మరింత అండగా ఉంటాం

● మంత్రి విడదల రజిని

గుంటూరు, ఏప్రిల్ 6: ప్రజలకు మరింత అండగా ఉంటామని, అభివృద్ధి చేసి పశ్చిమ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినీ అన్నారు. నగరంలోని 22వ డివిజన్ శ్రీనివాసరావుపేటలో వైసీపీ 18వ డివిజన్ అధ్యక్షుడు కలపాల సత్యనారాయణ, పార్టీ నాయకుడు కలపాల ప్రతాప్ ఆధ్వర్యంలో శనివారం 400 మంది కాపు యువకులు, 100 మంది మహిళలు మంత్రి సమక్షంలో వైసీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కాపు యువత చల్లా మధు, మామిడి అరవింద్, దరిమడుగు బుజ్జి, లగ్గల ప్రసాద్, లంకా అరవింద్, రంజిత్ కుమార్, బి.శ్రీనివాసరావు, ఎం. లక్ష్మీనారాయణ, ఎస్. నవీన్‌కుమార్, పి.దినేష్‌కుమార్, ఎన్.రవి, పి.వెంకటేష్, పి.శ్రీనివాసమూర్తి, యాకోబు, మహిళలు ధనలక్ష్మి, ఝాన్సీరాణి, పూర్ణిమ, పద్మ, వెంకటరత్నం, ఆదిలక్ష్మి, రేవతి తదితరులున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, అందుగుల సంతోష్, గోపి శ్రీనివాస్, ఆయా డివిజన్ల అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, సచివాలయ, బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలే తెలుగుదేశం పార్టీకి వెన్నెముక

● టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి



జయహో బీసీ సభలో మాట్లాడుతున్న గల్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ప్రజలే తెలుగుదేశానికి వెన్నెముక అని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి అన్నారు. గుంటూరు హనుమయ్య నగర్‌లో శనివారం 'జయహో బీసీ' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గల్లా మాధవి, కోవెలమూడి రవీంద్ర, నిమ్మల శేషయ్య, సింహాద్రి కనకాచారి ముఖ్య అతిదిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీలను ఎందరినో నాయకులుగా తెలుగుదేశం పార్టీ తయారు చేసిందని అన్నారు. బీసీలకు తెలుగుదేశం పార్టీ ఒక విశ్వవిద్యాలయం లాంటిదని అన్నారు. బీసీలను ఉన్నత స్థాయిలో ఉండే ప్రతి వందమందిలో 50 మంది బీసీలే ఉండేలా చేసే బాధ్యత తనదని అన్నారు. కార్యక్రమంలో చంద్రగిరి బాబు, ఉప్పుటూరి పేరయ్య, మల్లె ఈశ్వరావు, ఆడక శ్రీను, జాన్ సైదా, మునగ గణపతి, కొమ్మినేని కోటేశ్వరావు, వడ్లమూడి వెంకటేశ్వరావు, యారాకుల శ్రీను, కన్నసాని విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణనగర్ పార్కును ఆధునికీకరిస్తాం

గుంటూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): గుంటూరు 35వ డివిజన్‌లోని కృష్ణనగర్ పార్కును ఆధునికీకరిస్తామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి గల్లా మాధవి హామీ ఇచ్చారు. పార్కును శనివారం ఆమె సందర్శించారు. పార్కు నిర్వహణ సహా వసతులు సరిగా లేవంటూ అక్కడున్న సమస్యలను పార్కు సందర్శకులు ఆమె దృష్టికి తెచ్చారు. దానిపై మాధవి స్పందిస్తూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్కును మరింత ఆధునీకరించి, సుందరీకరణ పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. అనంతరం రైతుబజారును సందర్శించి మహిళలు, రైతులు, వినియోగదారుల సమస్యలు తెలుసుకున్నారు. 38వ డివిజన్‌లోని టెన్నిస్ కోర్టును కూడా సందర్శించి, క్రీడాకారులతో గల్లా మాధవి టెన్నిస్ ఆడారు. అనంతరం క్రీడాకారులను అడిగి సమస్యలపై ఆరా తీశారు. మందుబాబుల సమస్యతో మహిళలు సాయంత్రం వేళ తిరిగేందుకు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని, స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు దృష్టి పెడతామని మాధవి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరెంటి వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు 28వ డివిజన్ ముస్లిం మైనార్టీ నాయకుల ఆహ్వానం మేరకు శనివారం గల్లా మాధవి ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ముస్లింల పవిత్ర ఆరాధనలకు ప్రతీకగా నిలిచే రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. ఈ రంజాన్ పండుగ.. అందరికీ అన్ని విజయాలను తీసుకురావాలని మాధవి ఆకాంక్షించారు.

28వ డివిజన్‌లో భారీగా టీడీపీలో చేరికలు

గుంటూరు పశ్చిమలోని 28వ డివిజన్‌లో శనివారం తెలుగుదేశం పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. వైసీపీకి చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు 28వ డివిజన్ అధ్యక్షుడు తెల్లగోర్ల అప్పారావు నేతృత్వంలో ఆమె సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఐదేళ్లుగా వైసీపీ నేతల అరాచకాలు తట్టుకోలేకపోయామని, టీడీపీ అధినేత చంద్రబాబు ఇటీవల ప్రకటించిన సూపర్ 6 సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరామని వారు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ జోన్ 5 ఇన్‌ఛార్జ్ కోవెలమూడి రవీంద్ర, కసుకుర్తి హనుమంతరావు, మామిడి రామారావు, సింహాద్రి కనకాచారి, రవి, నల్లూరి శ్రీనివాస్ రావు, శివాజీ, కొండలు, మస్తాన్ వలి, మాధవరావు, శివ, చిరంజీవి, ప్రసాద్, సాంబయ్య, తేజ, సాయి పాల్గొన్నారు.



పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గల్లా మాధవి



కేంద్రాన్ని పరిశీలిస్తున్న దేవానందరెడ్డి తదితరులు

మూల్యాంకన కేంద్రాన్ని సందర్శించిన దేవానందరెడ్డి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 6: స్థానిక పెదకాకాని రోడ్డులోని సెయింట్ జోసెఫ్ స్కూలులో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి శనివారం సందర్శించారు. కేంద్రంలో జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతున్న తీరును పరిశీలించి, మూల్యాంకనం చేస్తున్న ఉపాధ్యాయులను కలిసి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు పని చేయాలని సూచించారు. ఎటువంటి పొరపాట్లకు అవకాశం లేకుండా మూల్యాంకన ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె.వెంకటరెడ్డి, డీవైఈవో బలిరాం, ప్రధానోపాధ్యాయులు తిరుమలేష్, ఉర్దూ డీఐ ఎస్‌కే ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

నగరంలో టిల్లు స్క్వేర్ యూనిట్ సందడి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 6 : నగరంలో శనివారం టిల్లు స్క్వేర్ యూనిట్ సందడి చేసింది. విజయోత్సవ యాత్రలో భాగంగా స్థానిక నగరంపాలెం ఫినిక్స్‌మాల్ థియేటర్‌లో హీరో సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు మల్లిక రామ్‌తో యూనిట్ పాల్గొన్ని ప్రేక్షకులను పలకరించారు. ఇంత గొప్ప విజయాన్ని అందించిన ప్రేక్షకులకు హీరో సిద్ధు జొన్నలగడ్డ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యూనిట్‌ను ఈవీవీ యువ కళా వాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మైత్రి మూవీస్ ప్రతినిధులు బయయేశ్వరరావు, నాగరాజు, రాధా, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



అభిమానులతో మాట్లాడుతున్న సిద్ధు జొన్నలగడ్డ

అలరించిన స్వరకల్పన అవధానం



అవధానంలో పాల్గొన్న పండితులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 6: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం జరిగిన స్వరకల్పన అవధానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అవధానిగా ప్రముఖ సంగీత విద్వాంసులు స్వర వీణాపాణి నిర్వహించగా పృచ్ఛకులుగా ప్రముఖ సాహితీవేత్తలు గోళ్ళ నారాయణ రావు, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ వెన్నా వల్లభరావు, డాక్టర్ ఉమా సాంబశివరావు, డాక్టర్ నల్లపనేని విజయలక్ష్మి, డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి, డాక్టర్ అంచె విజయలక్ష్మి, పెద్ది సాంబశివరావులు పాల్గొన్నారు. పృచ్ఛకులు ఇచ్చిన రచనలకు అప్పటికప్పుడు రాగాలను స్వరపరచి శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. తబలాపై పి.బాలాజి వాయిద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలను, అవధానిని ఘనంగా సత్కరించారు.

హింసను ప్రోత్సహిస్తున్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులు

● వైసీపీ దాడిలో గాయపడిన బాధితులను పరామర్శించిన ధారూనాయక్

గుంటూరు, ఏప్రిల్ 6 : రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో ఇప్పటి నుంచే ప్రశాంతంగా ఉండే పల్లెల్లో మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులు హింసను ప్రోత్సహిస్తున్నారని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూనాయక్ అన్నారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం కొత్త పుల్లారెడ్డి గూడెంలో ఈ నెల 5వ తేదీన స్థానిక వైసీపీ నాయకులు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముడావత్ తులసి నాయక్‌ని శనివారం ఆయన పరామర్శించారు. మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడి అండ దండలతో ముడావత్ తులసి నాయక్ మీద భౌతిక దాడి చేసి జీవనాధారమైన ఆటోని పగలగొట్టారన్నారు. సొంత బాబాయిని గొడ్డలితో చంపిన నాయకుల్ని వైసీపీ కార్యకర్తలు ఆదర్శంగా తీసుకున్నారన్నారు. మరి ముఖ్యంగా మాచర్ల నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరుల అరాచకాలు పరాకాష్టకు చేరాయన్నారు. అభివృద్ధి చేయటం చేతకాక దౌర్జన్యం, భౌతిక దాడులకు పాల్పడేందుకు వైసీపీ నాయకులను మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు ప్రోత్సహిసున్నారన్నారు. జగన్ రెడ్డి పాలనలో అభివృద్ధి శూన్యం, భూ కబ్జాలు, భౌతిక దాడులు, రాజకీయ హత్యలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని ధారూనాయక్ అన్నారు.



ఆసుపత్రిలో బాధితుడి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ధారూనాయక్

ఇసుకాసురుడు శంకరరావు

● అంబోతు రాంబాబును చిత్తుగా ఓడించండి

● క్రోసూరు, సత్తెనపల్లి ప్రజాగళం సభల్లో చంద్రబాబు

క్రోసూరు, సత్తెనపల్లి, ఏప్రిల్ 6: సత్తెనపల్లి ఎమ్మెల్యే, మంత్రి అంబటి రాంబాబు, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావులపై చంద్రబాబు ధ్వజమెత్తారు. క్రోసూరు, సత్తెనపల్లి ప్రజాగళం సభల్లో వారి అవినీతిని తూర్పారపట్టారు. క్రోసూరు సభలో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై చంద్రబాబు ధ్వజమెత్తారు. నియోజకవర్గం పేరు చెప్పగానే ఇసుకాసురుడు శంకరరావు గుర్తుకొస్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిటైల్‌గా ఇసుక దోపిడీకి పాల్పడతారని తాను భావించానని, అయితే హోల్‌సేల్‌గా దోపిడీ చేసి బందిపోటు మాదిరిగా మారాడన్నారు. కృష్ణానదిలోనే ఏకంగా ఇసుక దోపిడీ కోసం రోడ్డు వేశారంటే వీళ్ల బరితెగింపు ఏ స్థాయిలో ఉందో ఊహించవచ్చన్నారు. శంకరరావు ఇసుక దోపిడీ చేసి జగన్‌కి ఇస్తున్నాడన్నారు. ఆయన ఇసుక కోసం తవ్వించిన గోతుల్లో 12 మంది పడి చనిపోయారన్నారు. ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపి అణగదొక్కుతానని హెచ్చరించారు. అమరావతికి అన్యాయం జరుగుతుంటే ఇసుకాసురుడు శంకరరావు ఒక్కరోజు కూడా మాట్లాడలేదన్నారు. శంకరరావు 300 ఎకరాలు కొని దానిని ఇళ్ల పట్టాల కోసం ప్రభుత్వానికి ఇచ్చి రూ. వందల కోట్లు వెనకేసుకున్నాడని ఆరోపించారు. తెలంగాణ మద్యం తెచ్చి అమ్మిస్తున్నాడన్నారు. జగన్ ఒక మాయల పకీర్ అయితే శంకరరావు లాంటి వాళ్లు చోటా పకీర్లుగా తయారయ్యారన్నారు. ఆయన కొడుకు కూడా ఈ మధ్య హడావిడి చేస్తున్నాడన్నారు. గెలిస్తే టీడీపీలోకి వస్తానని సంకేతాలిస్తున్నాడన్నారు. తమ్ముళ్ల జోలికి వస్తే ఊరుకోనని భవిష్యత్తులో వడ్డీతో సహా చెల్లిస్తానని శంకరరావును హెచ్చరించారు.



ప్రజాగళం సభలో చిన్నారితో చంద్రబాబు

అంబోతు రాంబాబు

సత్తెనపల్లి సభలో రాంబాబును అంబోతు రాంబాబు అని అభివర్ణించారు. ఇరిగేషన్ మంత్రి అయిన ఆయనకు రాష్ట్రంలో ఎన్ని నదులు, ఎన్ని ప్రాజెక్టులు ఉన్నాయో కూడా తెలియదన్నారు. కనీసం సత్తెనపల్లిలో కాలువల్లో పూడిక తీయించడా అని ప్రశ్నించారు. ఆయనకు పదవి ఇచ్చింది తనను, పవన్‌కల్యాణ్ తిట్టడానికేనని చెప్పారు. నడి బజారులో ప్రజలు నిలదీసే రోజులు దగ్గర్లో ఉన్నాయన్నారు. సంక్రాంతి సంబరాల పేరుతో పింఛన్‌దారుల నుంచి అక్రమంగా డబ్బు వసులు చేశారని ఆరోపించారు. బీసీ యువకుడు చనిపోతే రూ.5 లక్షల నష్ట పరిహారంలో 50 శాతం వాటా అడిగారని తెలిపారు. వైసీపీ కార్యకర్తలు అక్రమ మైనింగ్ చేస్తున్నారని మంత్రిపైనే కోర్టుకు వెళ్లారన్నారు. మంత్రికి సీటు ఇవ్వొద్దని ఆ పార్టీలో వారే కోరారని అలాంటి అంబటిని చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు.

నమాజ్ కోసం ప్రసంగం నిలుపుదల

క్రోసూరు సభలో చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయం లో నమాజ్ ప్రారంభమైంది. దీంతో చంద్రబాబు తన ప్రసంగాన్ని రెండు సార్లు ఆపారు. ఆయన కూడా టోపి ధరించి మైకులో ప్రార్థన వింటూ ప్రార్థనలో పాల్గొన్నారు. నమాజ్ పూర్తిగా అయిపోయిన తర్వాత మళ్లీ ప్రసంగం ప్రారంభించారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కోటా అమలు చేస్తామని ప్రకటించారు. రంజాన్ కానుక ఇవ్వగా జగన్ వచ్చి వాటిని తీసేశారన్నారు. ముస్లింలపై దాడులు చేయిస్తున్నాడని చెప్పారు ముస్లింల బురకాలు లాగే స్థితికి వైసీపీ మూకలు వచ్చాయంటే పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందో గ్రహించాలన్నారు. ముస్లింలకు చంద్రబాబు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్డీయేలో టీడీపీ ఉన్నా ఏ ముస్లిం సోదరుడికి అన్యాయం జరగదని చంద్రబాబు హామీ ఇచ్చారు.



వనమా పూర్ణచంద్రరావును సన్మానిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

టీడీపీ విజయం కోసం కష్టించి పని చేస్తాం

● 'తూర్పు' అంతర్గత సమావేశంలో పెమ్మసానితో కార్యకర్తలు

గుంటూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి విజయం దక్కేలా కష్టించి పని చేస్తామని గుంటూరు తూర్పు నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ అభ్యర్థి పెమ్మసానితో చెప్పారు. గుంటూరులోని ఆయన కార్యాలయంలో శనివారం తూర్పు నియోజకవర్గ అంతర్గత సమావేశం జరిగింది. స్థానిక, సంస్థాగత సమస్యలపై ఈ సమావేశంలో పెమ్మసాని, నసీర్ కార్యకర్తలతో చర్చించారు. క్లస్టర్, బూత్, డివిజన్ స్థాయి నాయకులు కష్టించి పని చేయాలని ఎన్నికల్లో టీడీపీ విజయం చారిత్రాత్మకం కాబోతుందని పెమ్మసాని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, కార్పొరేటర్ పోతురాజు సమత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వనమా ఇంటికి పెమ్మసాని

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సరస్వతీ శిశు మందిర్ వద్ద ఉన్న జిల్లా అధ్యక్షుడు వనమా పూర్ణచంద్రరావు నివాసానికి గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆనాటి ఉద్యమ కాలంలో పోరాటం చేసినందుకుగాను తీహారు జైల్లో ఉంచిన విషయాన్ని పెమ్మసానికి వనమా వివరించారు. బీజేపీ కూడా ఎన్నో ప్రజారంజక పథకాలను మోదీ నాయకత్వంలో అమలు చేస్తోందని పెమ్మసాని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు అభ్యర్థి మహమ్మద్ నసీర్ అహ్మద్, వనమా తనయుడు, జిల్లా అధ్యక్షుడు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



బీజేపీ సీనియర్ నేతలను సన్మానిస్తున్న చిత్రం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 6 : భారతీయ జనతాపార్టీ 44వ వ్యవస్థాపక దినోత్సవం గుంటూరు లాలుపురం రోడ్‌లో గల వాజ్‌పేయి భవనంలో జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించి తదనంతరం జరిగిన సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి బీజేపీ సీనియర్ నాయకుడు వనమా పూర్ణచంద్రరావు ప్రసంగించారు. 'నేషన్ ఫస్ట్' అనే మంత్రంతో ప్రజలకు సేవ చేయడంలో నిమగ్నమై ఉన్న బీజేపీ దేశంలో అత్యంత ఇష్టమైన పార్టీ అని, ఇందుకోసం కృషి చేసిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు అభినంద నలు తెలిపారు. బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు జూపూడి రంగరాజు మాట్లాడుతూ ఎన్‌డీఏలో అంతర్భాగంగా బీజేపీ ఉన్నందుకు గర్విస్తున్నామని, ఈ కూటమి దేశ పురోగతిని, ప్రాంతీయ ఆకాంక్షలతోపాటు భారతదేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని విశ్వసిస్తోందన్నారు. బీజేపీ గుంటూరు పార్లమెంటు సంయోజక్ భీమినేని చంద్రశేఖర్ మాట్లాడుతూ పార్టీ ప్రణాళికలు, విధానాలు దేశంలోని పేద, అణగారిన వర్గాలకు కొత్త బలాన్ని ఇచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు చరక కుమార్ గౌడ్, చెరుకూరి తిరుపతిరావు, వైవీ సుబ్బారావు, పాలపాటి రవికుమార్, కొక్కెర శ్రీనివాస్, వెలగలేటి గంగాధర్, జంధ్యాల రామలింగశాస్త్రి, తోట శ్రీనివాస్, రావూరి నారాయణరావు, ఆవుల నాగేంద్ర యాదవ్, గూడూరు రాంబాబు, పాండురంగ విఠల్, సుకన్య, ప్రతాప్ ప్రసాద్, సాంబమూర్తి, మాదాల సురేష్, కారంశెట్టి రమేష్, సురేష్ జైన్, కంచర్ల రాజేష్, తిరువల్లూరు వెంకటరమణ, శివారెడ్డి, శోభన్ బాబు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం డాక్టర్ ఆంజయ్య తదితరులు

ఎన్ఎస్ఎస్ స్పేస్ పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 6 : అమెరికా కేంద్రంగా పని చేసే నేషనల్ స్పేస్ సొసైటీ(ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ స్పేస్ కాంటెస్ట్ 2024 పోటీల్లో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు వివిధ విభాగాల్లో బహుమతులు సాధించారని ఏజీఎం డాక్టర్ నూతలపాటి ఆంజయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో 28 పైగా దేశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. గుంటూరు శ్రీచైతన్య (శ్యామలానగర్) విద్యార్థులు మదాల రిత్విక్‌రెడ్డి, పాగోలు హర్షితశ్రియ, వడ్లమూడి మహేశ్వరి, సయ్యద్ అర్షియా సుల్తానా, మారెళ్ళ జశ్విశ్రీకీర్తిప్రియ, వజ్రాల దాక్షిణ్యరెడ్డి రూపొందించిన ఎంపీరియన్ ప్రాజెక్టుకు ప్రోత్సాహక బహుమతి వచ్చినట్లు చెప్పారు. విద్యార్థినీ, విద్యార్థులను కో ఆర్డినేటర్ సచ్చిదానందమూర్తి, స్కూల్ ప్రిన్సిపల్ అరుణ, డీన్ శివప్రసాద్, నాసా ఇన్‌చార్జి సుమతి తదితరులు అభినందించారు.

ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

గుంటూరు, ఏప్రిల్ 6 : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్, గుంటూరు మాడ్యూల్ వారు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా శనివారం నగరంపాలెంలో ఉన్న మెయిన్ బ్రాంచ్ ఏటీఎం ఎదుట చలివేంద్రం ఏర్పాటు చేశారు. బ్రాంచి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు, గుంటూరు మాడ్యూల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎన్.శ్రీనివాసాచార్యులు సమక్షంలో చల్లని తాగునీరు, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వేసవికాలం మొత్తం చలివేంద్రం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు ఉన్నతాధికారులతోపాటు యూనియన్ నాయకులు ఏజీఎస్‌లు కోటిరెడ్డి, నరేంద్రకుమార్, రంగసాయి, ఇబ్రహీం, సొసైటీ అధ్యక్షుడు శ్రీకృష్ణమోహన్, లోకల్ సెక్రటరీలు రాజశేఖర్, సంపత్‌కుమార్, ఖలీల్, కాశీ విశ్వనాద్ ఉన్నారు.




చలివేంద్రం ప్రారంభిస్తున్న ఏజీఎం శ్రీనివాసరావు, శ్రీనివాసాచార్యులు తదితరులు


LYCA
SUBASKARAN PRESENTS
ULAGANAYAGAN
KAMAL HAASAN
IN
SHANKAR'S
భారతీయుడు II
ZERO TOLERANCE
RELEASING IN
JUNE 2024
IN CINEMAS WORLDWIDE
MUSIC ANIRUDH DIRECTOR OF PHOTOGRAPHY RAVI VARMAN
G.K.M.TAMIL KUMARAN - M.SHENBAGAMOORTHY
PRODUCED BY SUBASKARAN
NETFLIX


ZEE STUDIOS & BONEY KAPOOR PRESENT
IN ASSOCIATION WITH FRESHLIME FILMS
IN CINEMAS
THIS WED.
BONEY KAPOOR'S
MAIDAAN
BASED ON A TRUE STORY
EXPERIENCE IT IN IMAX
ADVANCE BOOKING NOW OPEN
A FILM BY AMIT RAVINDERNATH SHARMA
MUSIC COMPOSER A.R. RAHMAN
BAYVIEW PROJECTS


VIJAY ANTONY FILM CORPORATION
MEERA VIJAY ANTONY
PRESENTS
WORLDWIDE RELEASE
APRIL 11
MYTHRI
లవ్ గురు
U/A
VINAYAK VAITHIANATHAN


MAHATEJA
APRIL
19
IN
THEATERS
TENANT
SCREENPLAY, DIALOGUES & DIRECTION Y. YUGANDHAR PRODUCER CHANDRASHEKHAR REDDY MOGULLA
ADITYA MUSIC


PARAVA FILMS
GOKULAM GOPALAN
SREE GOKULAM MOVIES
మలయాళంలో 200 కోట్లు సాధించిన
మంజుమ్మల్ BOYS
WRITER & DIRECTOR CHIDAMBARAM
PRODUCED BY BABU SHAHIR, SOUBIN SHAHIR, SHAWN ANTONY
ADVENTUROUS
BLOCKBUSTER
think music
MYTHRI MOVIE MAKERS
Sukumar writings


SUMMER FAMILY ENTERTAINER
SRI VENKATESWARA CREATIONS
VIJAY DEVERAKONDA
THE FAMILY STAR
PARASURAM
DIL RAJU PRODUCTION
NOW IN CINEMAS

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



వార్డులోని ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తున్న నాదెండ్ల మనోహర్

తెనాలిలో నాదెండ్ల విస్తృత ప్రచారం

తెనాలి రూరల్, ఏప్రిల్ 6: రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజలకు నిజమైన సంక్షేమం అందాలంటే రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెలుగుజనచైతన్య పాదయాత్రలో భాగంగా నాదెండ్ల మనోహర్ శనివారం పట్టణంలోని 6వ వార్డు నందుల పేట నుండి ప్రారంభమై వార్డు ప్రజల యోగక్షేమాలు విచారిస్తూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న మనోహర్ గుర్తు గాజు గ్లాసు, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్ గుర్తు సైకిల్ పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మనోహర్ దృష్టికి వార్డు ప్రజలు అనేక సమస్యలను తీసుకువచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరిస్తానని చెప్పారు. తొలుత వార్డులో ఎన్టీఆర్ విగ్రహానికి నాదెండ్ల మనోహర్ నివాళులర్పించారు. పార్టీ నాయకులు ఏర్పాటుచేసిన పుట్టినరోజు కేక్‌ను మనోహర్ కట్‌చేశారు. పార్టీ శ్రేణులు, అభిమానుల ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

పర్యావరణాన్ని రక్షించకుంటే

మానవాళి మనుగడ ప్రశ్నార్థకం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 6 : పర్యావరణాన్ని రక్షించకపోతే మానవాళి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు చెప్పారు. క్లబ్ ఆధ్వర్యంలో ఐతానగర్ ఎస్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో పర్యావరణంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భావి తరాలకు వారసులైన విద్యార్థులు పర్యావరణం కోసం అవగాహన చేసుకుని కాపాడేందుకు సాటి వారిని చైతన్యపరచాలన్నారు. ఈదర వెంకటపూర్ణచంద్, ఎస్.వెంకటేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, కిరణ్ పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

9న ఉగాది వేడుకలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 6: క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పట్టణానికి చెందిన వివిధ సంస్థలు వారు ఏర్పాట్లు చేస్తున్నాయి. స్వరలయ వేదిక ఆధ్వర్యంలో శ్రీవాసవీ ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించనున్నారు. పురస్కార సభలో వివిధ రంగాల్లో సేవలు అందించిన వారిని ఈ సందర్భంగా వారు సత్కరించనున్నారు. సంగీత విభావరి నిర్వహిస్తారు. ఉగాది పంచాగ శ్రవణం కూడా జరుగుతుందని నిర్వాహకులు లక్కరాజు సాయి తెలిపారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

● పొన్నూరు కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్



వార్డు ప్రజలతో మాట్లాడుతున్న నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, ఏప్రిల్6 : రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పొన్నూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేసారు. పట్టణంలోని 30, 31 వార్డులో శనివారం నరేంద్ర కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలను, బాబు ష్యూరిటీ- భవిషత్‌కు గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లిన నరేంద్ర కుమార్ స్థానికులతో ముచ్చటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు వృద్ధులు, మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి నరేంద్రకుమార్‌కు వివరించారు. అనంతరం నరేంద్రకుమార్ మాట్లాడుతూ వైసీపీని నమ్మి ఓట్లేసి ప్రజలు అధికారం ఇస్తే రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారని ఆరోపించారు. అన్ని రంగాలో వెనకపడిపోయిన ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి అభివృద్ధి బాట పట్టించాలంటే ఎన్డీఏ కూటమి విజయంతోనే సాధ్యన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పన, నిరుద్యోగులకు నెలకు రూ.3000 భృతి, ప్రతి రైతుకు ఏడాదికి రూ. 20 వేలు సాగుకు సాయం, 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15000, ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వృధులకు ఇచ్చే సామాజిక పింఛన్ల పెంపు, ఇవే కాకుండా అనేక సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసగించటమే తప్ప చేసిందేమి లేదన్నారు. అబద్దాల పునాదులపై రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి కాలయాపన సీఎం జగన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన తనను, డాకర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను గెలిపించాలని నరేంద్రకుమార్ విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా పలువురు కాపు నాయకులు నరేంద్ర కుమార్‌ను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జనసేన సమన్వయ కర్త వడ్రాణం మార్కండేయ బాబు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధూళిపాళ్ళతో అంబటి సోదరుల భేటి ..

పట్టణంలోని శ్రీవేధా విద్యాసంస్థల అధినేతలు అంబటి సోదరులు శనివారం మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌తో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. వేధా సంస్థల అధినేతుల అంబటి వెంకటేశ్వరరావు, అంబటి ఏడు కొండలు నరేంద్ర కుమార్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందచేసారు. అంబటి సోదరులతో పాటు గరిగంటి సాయి బాబు, బండారుపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వేజండ్లలో ఇఫ్తార్ ..

చేబ్రోలు : మండల పరిధిలోని వేజండ్ల గ్రామంలో శనివారం ముస్లింలు ఇఫ్తార్ ఏర్పాటు చేయగా ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పాల్గొన్ని ప్రత్యేక ప్రార్ధనలు చేసారు. మత పెద్దల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం ముస్లింలకు స్వయంగా విందు వడ్డించారు. కార్యక్రమంలో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ముస్లింలకు ఇఫ్తార్ వడ్డిస్తున్న నరేంద్ర కుమార్

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



బీజేపీ పతాకాన్ని ఎగురవేస్తున్న నాయకులు

పొన్నూరుటౌన్, ఏప్రిల్6ః పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిధిగా హాజరైన అసెంబ్లీ కన్వీనర్ వరికూటి సుధాకర్ పార్టీ పతాకాని ఎగురవేసి వందన సమర్పణ చేసారు. అనంతరం పార్టీ వ్యవస్థాపకుల చిత్రపట్టాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గోవాడ కృష్ణారావు, నాయకకులు కలపాల శ్రీనివాసరావు, బట్టిప్రోలు రామకృష్ణ, మండల అధ్యక్షుడు వడ్రాణం ఉదయ్ చంద్రరావు, పరాశరం రంగవలీ, మొగలిపువ్వ సాంబశివరావు, చిలకపాటి లక్ష్మణ్ రామాచార్యులు, కలపాల విజయ్ లక్ష్మీ, గోవాడ విజయ్ లక్ష్మీ, పాతూరి సోమేశ్వరరావు, తోట జనార్ధన రావు, తన్నీరు శివరామ కృష్ణ, ఆరె వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలి

● కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 6: జిల్లాలో సాధారణ ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు జరిగేలా నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన స్టాట్యూటరీ బృందాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు తనిఖీలు నిర్వహించేలా రిటర్నింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎన్నికల అంశాలపై జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఓటర్ల దరఖాస్తుల పరిష్కారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై తీసుకున్న చర్యలు, సీవిజిల్, ఇతర ఫిర్యాదుల పరిష్కారం, స్టాట్యూటరీ బృందాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల సీజ్ చేసిన నగదు, మద్యం, ఇతర వస్తువులు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లాల వారీగా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించి సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మరియు సంయక్త కలెక్టర్ జి.రాజకుమారి, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మరియు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తీ చేకూరి, తెనాలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మరియు తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా తో కలసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వేణుగోపాల్‌రెడ్డి అధికారులతో మాట్లాడుతూ ఓటరు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో విచారించి నిర్దేశిత సమయానికి సక్రమంగా పరిష్కరించేలా వీఆర్వోలు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లను రోజు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల నివేదికలు నిర్దేశిత నమూనాలో రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందించాలన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మీ, నోడల్ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

లంచం అడిగారని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బసివిరెడ్డి

కొల్లిపర, ఏప్రిల్ 6: పోలీసులు లంచం అడిగినందుకు ఒక వ్యక్తి ఆత్మహత్యయత్నం చేసుకున్న సంఘటన మండల కేంద్రం కొల్లిపరలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లిపరకు చెందిన ఈదా బసివిరెడ్డి మార్చి 25న ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. ఈ నెల 2న ట్రాక్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. వెంటనే బసివిరెడ్డి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో ఈ నెల 5న పోలీసులు కృష్ణాజిల్లా పామర్రులో ట్రాక్టర్ చోరీకి సంబంధించి ట్రాక్టర్‌తో పాటు 9 మందిని పోలీసు స్టేషన్‌కు తీసుకు వచ్చారు. అయితే ట్రాక్టర్‌ను బసివిరెడ్డికి ఇవ్వటానికి పోలీసులు రూ.2 లక్షలు డిమాండ్ చేశారు. అంత డబ్బు ఇవ్వలేనని బసివిరెడ్డి చెప్పగా కానిస్టేబుల్ శ్యామ్ బసివిరెడ్డిని దుర్భాషలాడాడు. దీంతో మనోవేదనకు గురైన బసివిరెడ్డి ఇంటి వెళ్ళి పురుగు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను కొల్లిపర ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చారు. ప్రస్తుతం బసివిరెడ్డి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. పోయిన ట్రాక్టర్ తెచ్చి ఇచ్చినందుకు డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు పోలీసులు తనను దుర్భాషలాడారని బసివిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు.

ఈఘటనపై పోలీసులను వివరణ కోరగా.. ఈదా బసివిరెడ్డి తమ బంధువులకు రూ.10లక్షలు ఇవ్వాల్సి ఉండగా వారు బసివిరెడ్డికి చెప్పి ట్రాక్టర్‌ను తీసుకు వెళ్లారన్నారు. బసివిరెడ్డి పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేయడంతో ట్రాక్టర్‌ను బంధువుల దగ్గర నుంచి అతనికి ఇప్పించామన్నారు. తాము ఎటువంటి లంచం అడగలేదని తెలిపారు. రూ.10 లక్షలు గురించి మాకు ఎటువంటి సంబంధం లేదని, గ్రామ పెద్దలు సమక్షంలో తెల్చుకోవాల్సిందిగా అతని బంధువులకు చెప్పామన్నారు. పంచాయతీ నిమిత్తం గ్రామ పెద్దలు రూ.2లక్షలు ఇవ్వాలని బసివిరెడ్డికి చెప్పడంతో అతను పురుగుమందు తాగినట్లు తెలిసిందన్నారు.

క్షయ వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహారం పంపిణీ

తెనాలి రూరల్, ఏప్రిల్ 6: తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో క్షయవ్యాధిగ్రస్తులకు కోహినీ వారి సహకారంతో టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కే. రాధిక చేతుల మీదుగా పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ టీబీ వ్యాధి సోకిన వారు మందులతో పాటు పౌష్టికాహారమూ తీసుకోవాలన్నారు. ఈ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు త్వరలో బీసీజీ వ్యాక్సిన్ అందుబాటులోకి రానున్నదని తెలిపారు. వ్యాక్సిన్ పొందేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ దగ్గరలోని సచివాలయంలో ఏఎన్ఎమ్‌లను సంప్రదించి పేరు నమోదు చేసుకోవలని కోరారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సిబ్బంది రవికుమార్, లక్ష్మి, భార్గవి, దిలీప్, పావని పాల్గొన్నారు.

నేడు ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ఇఫ్తార్

తెనాలి రూరల్, ఏప్రిల్ 6: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో తెనాలిలో ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేయనున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెనాలి పట్టణంలోని చినరావూరు పార్క్ సమీపంలోని నూకల రామకోటేశ్వరరావు (పాత రాజ్యంటాకీస్) కల్యాణమండలంలో సాయంత్రం 6 గంటలకు జరిగే ఇఫ్తార్ విందు కార్యక్రమానికి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌లు పాల్గొంటారని, నియోజవర్గంలోని ముస్లింలందరూ పాల్గొని ఇఫ్తార్‌ను స్వీకరించాలని ఆయన కోరారు.



జంగాల అజయ్ కుమార్‌ని సత్కరిస్తున్న ఇండియా కూటమి నేతలు

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి

● గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 6: రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని గుంటూరు పార్లమెంట్ ఇండియా కూటమి అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో శనివారం ఇండియా కూటమి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా ఎన్నికైన సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్‌ని నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమిల్లి సింగారావు పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యంగ విలువలను మంటగుపుతున్న బీజేపీ పాలన నుంచి దేశాన్ని విముక్తి కలిగించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలను తన గుప్పెట్లో పెట్టుకొని బీజేపీ ఆంధ్రులతో వికృత క్రీడ ఆడడానికి తెరతీస్తుందని విమర్శించారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే ఆపార్టీ పెద్దలు చెప్పినట్లు ఈ దేశానికి ఇవే చివరి ఎన్నికలు అవుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్, సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు బొల్లిముంత కృష్ణ, ఏఐఎస్ఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి రాజేష్, జి శివ, సీపీఐ నేతలు పరుచూరి వెంకటేశ్వరావు, శశికిరణ్, గణేష్ యస్వంత్, తేజ, సలీం, పవన్ పాల్గొన్నారు.

నేడు అన్నమాచార్యుల ఆరాధనోత్సవం



కరపత్రాన్ని ఆవిష్కరించిన సంకీర్తన సేవా బృంద సభ్యులు

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 6: స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవ బృందం వారు శ్రీతాళ్ల పాక అన్నమాచార్య వారి 521వ ఆరాధనోత్సవ కరపత్రాన్ని బృంద కన్వీనర్ కొండెపి శ్రీనివాసరావు, అందె బాలచంద్రమౌళిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు అన్నమాచార్యల ఆరోధనోత్సవాలలో భాగంగా పట్టణానికి చెందిన సంకీర్తన బృందాలచే అన్నమయ్య సంకీర్తన గానం జరుగునని తెలిపారు. కార్యక్రమానికి పట్టణ ప్రజలు, సంగీత అభిమానులు పాల్గొన వలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణమూర్తి, సంకీర్తన బృంద సభ్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

● డీఎస్పీ రమేష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్‌బాబు

తెనాలిక్రైం, ఏప్రిల్ 6: ఆటో డ్రైవర్లు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని లేదంటే కఠిన చర్యలు తీసుకోవాలని వస్తుందని డీఎస్పీ రమేష్‌బాబు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ఆటో డ్రైవర్లపై గురుతర బాధ్యత ఉందన్నారు. ఓవర్ లోడ్ ఎక్కించడం, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, ఆటోలో డీజే సౌండ్స్ పెట్టడం, మైనర్లుకు ఆటోలు ఇవ్వడం వంటివి చట్టరీత్యా నేరమాన్నరు. ఆటోడ్రైవింగ్ సందర్బంలో తగిన లైసెన్సు పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. నిబంధనలు పాటించకపోతే కఠినంగా వ్యవహరించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ సీఐలు, ఎస్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆహారం పంపిణీ చేస్తున్న జనసేనపార్టీ నేతలు

పేదలకు అన్నదానం

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 6: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో శ్రీశివలింగేశ్వర అన్నదాన సత్రం వద్ద జనసేన పీఏసీ చైర్మన్, టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ పుట్టిన రోజు సందర్భంగా గ్యాలం వేణు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పట్టణాధ్యక్షుడు తోటకూర వెంకట రమణరావు, నాదెండ్ల కుమారుడు నాదెండ్ల మిథుల్, వల్లెం మురళి, అమ్మిశెటి వాసులు పాల్గొని పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని జక్కా శ్రీనివాసరావు నిర్వహనలో కొసనా రాంబాబు, పట్టణ చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు షేక్ దావూద్, శిల్పాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వధార్‌లో పండ్ల పంపిణీ

స్థానిక చెంచుపేటలోని జేఎంజే స్వధార్ హోమ్‌లో శనివారం నాదెండ్ల మనోహర్ 60 వ పుట్టిన రోజు వేడుకలను పాలడుగు ప్రణీత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా నాదెండ్ల మనోహర్ కుమారుడు నాదెండ్ల మిథుల్ పాల్గొని జన్మదిన కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. హోమ్‌లోని అనాధలకు పండ్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో కొల్లూరు శ్రీధర్ అండ్ ఫ్రెండ్స్, కొత్తపల్లి కృష్ణతేజ, కొసరాజు సన్ని, నియోజకవర్గ తెలుగు విద్యార్థి అధ్యక్షుడు అయినంపూడి జితేష్, మునగ నరసింహ, జాస్తి కిట్టు, సుబ్బారావు, వంశీ, బన్నీ పాల్గొన్నారు.

ఘనంగా నాదెండ్ల జన్మదిన వేడుకలు

● శుభాకాంక్షలు తెలిపిన జనసేన, టీడీపీ పార్టీ నేతలు, వివిధ సంస్థల ప్రతినిధులు



పార్టీ కార్యాలయంలో కేక్‌కట్‌చేస్తున్న నాదెండ్ల మనోహర్ గాదె వెంకటేశ్వర్లు, తోటకూర వెంకటరమణారావు, పార్టీ శ్రేణులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 6: జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ జన్మదిన వేడుకలు తెనాలి పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుండే మనోహర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు టీడీపీ,జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యాలయానికి విచ్చేసి మనోహర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ శ్రేణుల మధ్య మనోహర్ పుట్టిన రోజుకేక్‌ను కట్‌చేసి తనపై చేపుతున్న అభిమానానికి రుణపడి ఉంటానన్నారు. నాదెండ్ల నాయకత్వం వర్ధిలాలి అంటూ పార్టీ శ్రేణుల నినాదాలతో ఆప్రాంతం మారుమోగింది. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాటిబండ్ల రమకృష్ణ, జనసేన నాయకులు గాదె వెంకటేశ్వర్లు, తోటకూర వెంకటరమణారావు, బండారు రవికాంత్. వెనిగళ్ళ నారాయణ, చావ బాబ్జి, యదుకృష్ణ(చిట్టిబాబు) పెద్ద సంఖ్యలో ఉమ్మడి పార్టీల నేతలు, శ్రేణులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు మనోహర్..

తెనాలిరూరల్ : ప్రజలకు తన వంతు మంచి చేయాలని, తెనాలి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని తపించే మంచి మనస్సున్న నాయకుడు నాదెండ్ల మనోహర్ అని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి, కన్నెగంటి మురళీకృష్ణ, కనగాల నాగభూషణం, ఈదర వెంకట పూర్ణచంద్, ముప్పవరపు సాంబశివరావు, మమత బ్రదర్స్ అన్నారు. పట్టణ జనసేన పార్టీ కార్యాలయంలో నాదెండ్ల మనోహర్‌ను కలిసి గజమాలతో అయనను ఘనంగా సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఎమ్ఎల్ ఖాదర్, విష్ణు, పలువురు గణేష్‌యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్లకు ఆనందబాబు శుభాకాంక్షలు..

జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్లమనోహర్‌కు మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనంద్‌బాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం నాదెండ్ల మనోహర్ పుట్టిన రోజును పురస్కరించుకుని తెనాలి జనసేన పార్టీ కార్యాలయానికి మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు విచ్చేసి నాదెండ్ల మనోహర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

నాదెండ్లకు శుభాకాంక్షలు : మాజీ ఎమ్మెల్యే ఉమ

జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పుట్టిన రోజును పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి పార్టీల నాయకులు కోగంటి శంకరరావు, బొల్లినేని బుజ్జిలు మనోహర్‌ను దుశాలువాలతో ఘంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న ఆనంద్‌బాబు



శుభాకాంక్షలు తెలుపుతున్న డాక్టర్ గోగినేని ఉమ



శుభాకాంక్షలు తెలుపుతున్న గణేష్‌యూత్ సభ్యులు, టీడీపీ నాయకులు